
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీకాకుళం
జిల్లా వార్తలు
మంగళవారం 11 నవంబరు 2025



మంత్రి అచ్చెన్నాయుడు దిగ్భ్రాంతి

ఢిల్లీలో భారీ పేలుడు ఘటనపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ఘటన మానసికంగా తనను కలచివేసిందన్నారు. పేలుడు ధాటికి పలువురు మృతి చెందడం, కొందరికి గాయాలు కావడం దురదృష్టకరమన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. బాధితులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ.. పరిస్థితిని అదుపులోకి తీసుకునేందుకు వేగంగా స్పందించిన సహాయక సిబ్బందిని అభినందించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మరింత కఠినమైన భద్రతా చర్యలు తీసుకోవాలని కోరారు.



జిల్లా సరిహద్దులో వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

లాడ్జిలో వివరాలు ఆరా..

జిల్లాలో హై అలర్ట్

- ఢిల్లీలో బ్లాస్టింగ్ ఘటనతో ముమ్మరంగా తనిఖీలు
- విశాఖ సమ్మిట్ నేపథ్యంలో మరింత అప్రమత్తం


శ్రీకాకుళం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): దేశ రాజధాని ఢిల్లీలోని ఎర్రకోట మెట్రోస్టేషన్ సమీపంలో సోమవారం రాత్రి బాంబు పేలింది. ఈ ఘటనలో 10 మంది మృతి చెందగా.. 24 మంది తీవ్రంగా గాయపడ్డారు. కాగా.. విశాఖపట్నంలో పారిశ్రామిక సదస్సు 'సమ్మిట్' మంగళవారం నిర్వహించనున్న నేపథ్యంలో అంతటా అప్రమత్తంగా ఉండాలని డీజీపీ ఆదేశించారు. సోమవారం ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి.. రాష్ట్రవ్యాప్తంగా తనిఖీలు నిర్వహించాలని స్పష్టం చేశారు. దీంతో జిల్లా అంతటా హైఅలర్ట్ నెలకొంది. డీజీపీ ఆదేశాల మేరకు ఎస్పీ మహేశ్వరరెడ్డి జిల్లా పోలీసు యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. సోమవారం రాత్రి నుంచి పోలీసులంతా రోడ్లపైనే ఉన్నారు. శ్రీకాకుళంలో ఉన్న అన్ని లాడ్జీలను బృందాలుగా వెళ్లి తనిఖీచేశారు. లాడ్జీలలో ఎవరెవరు ఉంటున్నారు.. ఏయే ప్రాంతాలకు చెందినవారు ఉంటున్నారన్నదీ ఆరా తీశారు. శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్, నిర్మానుష్య ప్రాంతాలు, రైల్వేస్టేషన్లు, కార్తీక సోమవారం సందర్భంగా రాత్రి కూడా భక్తులతో నిండి ఉన్న శివాలయాల వద్ద.. ప్రార్థనా స్థలాల వద్దనూ పోలీసులు మోహరించారు. నాగావళి నదీ తీరాన్ని పరిశీలించారు. బృందాలుగా విడిపోయి.. శ్రీకాకుళంతో పాటు ఆమదాలవలస, నరసన్నపేట, ఇచ్ఛాపురం, టెక్కలి, పలాస-కాశీబుగ్గ, (మిగతా 6వ పేజీలో..)

విశాఖలో సమ్మిట్‌కు జేసీ

శ్రీకాకుళం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో మంగళవారం జరగనున్న సీఐఐ పార్టనర్ షిప్ సమ్మిట్-2025 సదస్సును విజయవంతంగా నిర్వహించేందుకు పలువురు ఐఏఎస్ అధికారులకు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులను జారీచేసింది. ఇందులో భాగంగా శ్రీకాకుళం జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ మంగళవారం ఉదయం విశాఖలో ఇండస్ట్రీస్ కామర్స్ శాఖ వద్దకు చేరుకోవాలి. సమ్మిట్ పూర్తయ్యే వరకు అక్కడే విధుల్లో ఉండాలి. జేసీతోపాటు ఎయిర్‌పోర్ట్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ ప్రవీణ్ ఆదిత్య, ఏపీ ఈస్టర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ సీఎండీ పృథ్వీతేజ ఇమ్మడి, గిరిజన్ కోఆపరేటివ్ కార్పొరేషన్ ఎండీ కల్పన కుమారి, ఏపీ మారిటైమ్ బోర్డు సీఈవో అభిషేక్ కుమార్, పార్వతీపురం మన్యం జిల్లా జాయింట్ కలెక్టర్ యశ్వంత్ కుమార్ రెడ్డి కూడా 'సమ్మిట్' పూర్తయ్యే వరకు అక్కడ ఉండాలని సాధారణ పరిపాలన ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి కె.విజయానంద్ ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.

అమ్మో.. 'సికెల్ సెల్ ఎనీమియా'

- ఏజెన్సీలో పెరుగుతున్న రోగుల సంఖ్య
- రాష్ట్రంలోనే సిక్కోలుకు మూడో స్థానం
- జిల్లాలో 859 మంది క్యారియర్లు
- 189 పాజిటివ్ కేసులు నమోదు



శ్రీకాకుళం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): అరుదైన జన్యుపర రక్త సంబంధిత వ్యాధి.. 'సికెల్ సెల్ ఎనీమియా' ప్రస్తుతం ప్రమాదకరంగా విస్తరిస్తోంది. ఆరోగ్యశాఖ సేకరించిన వివరాల ప్రకారం.. రాష్ట్రవ్యాప్తంగా ఈ వ్యాధి నమోదులో శ్రీకాకుళం జిల్లా మూడో స్థానంలో ఉండడం ఆందోళనకు గురిచేస్తోంది. ప్రధానంగా గిరిజన ప్రాంతాల్లోనే ఈ కేసుల సంఖ్య పెరుగుతోంది. జిల్లాలో 859 మంది సికెల్ సెల్ క్యారియర్లుగా ఆరోగ్య శాఖ గుర్తించింది. 189 మంది సికెల్ సెల్ ఎనీమియా పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. మెళియాపుట్టి, మందస, కొత్తూరు, హిరమండలం, మెట్టూరు, సిరిపురం, బుడంబో కాలనీ, హరిపురం తదితర ఏజెన్సీ ప్రాంతాల్లో 'సికెల్ సెల్ ఎనీమియా' కేసులు బయటపడుతున్నాయి. నేషనల్ హెల్త్ మిషన్ ఆధ్వర్యంలో 'సికెల్ సెల్ ఎనీమియా' ప్రభావిత ప్రాంతాల్లో నలభై ఏళ్లలోపున్న వారికి వైద్య పరీక్షలను నిర్వహిస్తున్నారు.

● లక్షణాలివీ..

ఈ వ్యాధి ప్రధానంగా ఒక తరం నుంచి మరో తరానికి జన్యుపరంగా వస్తుంది. అలజడి జీవనశైలి, అవగాహన లేకపోవడం, గ్రామీణ-గిరిజన ప్రాంతాల్లో ముందస్తు స్క్రీనింగ్ లోపం.. ఇవన్నీ కలిసి ప్రభావం చూపుతున్నాయి. ఈ వ్యాధిసోకిన వారికి రక్తంలోని ఎర్రరక్త పదార్థాలు(ఆర్‌బీసీ) సాధారణంగా.. గుండ్రంగా ఉండకుండా.. సికెల్(పెంకు ఆకారంలో)గా మారుతాయి. దీంతో రక్త ప్రవాహం అడ్డంకులు ఎదుర్కొంటుంది. ఆక్సిజన్ సరఫరా తగ్గిపోతుంది. దీనివల్ల రోగికి తీవ్రమైన రక్తహీనత, శ్వాసలో ఇబ్బంది, ఎముకలు, కండరాలలో తీవ్రమైన నొప్పులు, అవయవ నష్టమయ్యే అవకాశం, పొట్ట ప్రాంతంలో నొప్పి.. నీరసం, కొన్ని సందర్భాల్లో ప్రాణాపాయ పరిస్థితులు ఎదురవుతాయి. సాధారణంగా ప్రారంభ దశలో దీనిని గుర్తించడంలో చాలా మంది విఫలమవుతున్నారు. చికిత్సకు సమయం పట్టడం, ఖర్చు భారంగా ఉండటం.. వంటి సమస్యలూ ఉన్నాయి.

● వైద్యులు ఏమంటున్నారంటే...?

వైద్య ఆరోగ్యశాఖ నిపుణుల అభిప్రాయం ప్రకారం.. వివాహానికి ముందు జెనెటిక్ స్క్రీనింగ్ తప్పనిసరిగా చేయాలి. క్యారియర్‌లైన ఇద్దరు వ్యక్తులు పెళ్లి చేసుకుంటే.. వారికి పుట్టే పిల్లల్లో రిస్క్ చాలా ఎక్కువ. ఇప్పటికే ఈ వ్యాధితో ఉన్న వారికి వైద్యపరంగా ఖర్చులు అధికంగా ఉంటాయి. రక్తమార్పిడి (మిగతా 6వ పేజీలో..)

● కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నాం

హిరమండలం, కొత్తూరు, మందస.. సీతంపేట తదితర మండలాల్లోని గిరిజన ప్రాంతాల్లోనూ సికెల్ సెల్ ఎనీమియా కేసులు నమోదయ్యాయి. ఈ ప్రాంతాల్లో ఇప్పటికే కౌన్సెలింగ్‌ను నిర్వహిస్తున్నాం. ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో ఈ రోగులకు రక్తమార్పిడి జరిగేలా వైద్యసదుపాయం కూడా కల్పించాం. కొత్తగా గుర్తించిన కేసులకు పింఛన్లు మంజూరయ్యేలా ప్రతిపాదన సిద్ధం చేశాం. గిరిజన ప్రాంతాల్లో జన్యుపరంగా ఈ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకుంటున్నాం.

- డా.మేరీ కేథరీన్, ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో, శ్రీకాకుళం



శ్రీకాకుళం నాగావళి నదీ తీరాన దీపారాధన చేస్తున్న మహిళలు





ఉమారుద్ర కోటేశ్వరుడికి పూజలు..



శ్రీముఖలింగంలో భక్తుల రద్దీ

ఓం మహాప్రాణ దీపం.. శివం శివం

- ఆలయాలకు పోటెత్తిన భక్తులు
- నాగావళి నదీతీరాన దీపకాంతులు



అరసవల్లి, టెక్కలి, టెక్కలి రూరల్, జలుమూరు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): కార్తీకమాస మూడో సోమవారాన్ని పురస్కరించుకుని శివాలయాలకు భక్తులు పోటెత్తారు. శ్రీకాకుళంలో నాగావళి నదీ తీరాన సోమవారం వేకువజామున అధిక సంఖ్యలో మహిళలు దీపాలు వెలిగించి విడిచిపెట్టారు. అనంతరం ఉమారుద్రకోటేశ్వరుడ్ని దర్శించుకుని పూజలు చేశారు. టెక్కలి మండలం రావివలసలో ఎండలమల్లన్న ఆలయం శివనామస్మరణతో మార్మోగింది. ఎటుచూసినా భక్త జనం కనిపించింది. గత శనివారం కాశీబుగ్గలోని వెంకటేశ్వరాలయంలో జరిగిన సంఘటనను దృష్టిలో పెట్టుకొని పోలీసులు గట్టి భద్రతా చర్యలు చేపట్టారు. భక్తులు రావివలస చేరుకునేందుకు విశాలమైన మార్గాలను అధికారులు ఏర్పాటు చేశారు. ఉచిత వైద్య శిబిరాల ద్వారా సేవలు అందించారు. జలుమూరు మండలంలో శ్రీముఖలింగం.. భక్తులతో కిటకిటలాడింది. వంశధార నదీ తీరంలో భక్తులు స్నానాలు ఆచరించి.. దీపారాధనలు చేశారు. అనంతరం శ్రీముఖలింగేశ్వరుడ్ని దర్శించుకుని పూజలు చేశారు. సోమేశ్వర, భీమేశ్వరాలయాల్లో కూడా పూజలు చేశారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా అధికారులు చర్యలు చేపట్టారు.

కారు రిపేరు చేస్తుండగా..

- వెనుక నుంచి వస్తూ బలంగా ఢీకొన్న మరో కారు
- మెకానిక్ మృతి.. మరో ముగ్గురికి తీవ్ర గాయాలు
- కోమర్తి వద్ద ఘటన

8లో



వెంకటరావు (ఫైల్)

సింగిల్ లేన్ల విస్తరణ ఎప్పుడో?

- ఇరుకు రోడ్లతో రాకపోకలకు ఇబ్బంది
- తరచూ ప్రమాదాలు
- మలుపుల వద్ద కానరాని హెచ్చరిక బోర్డులు

8లో

స్పీడ్‌బ్రేకర్లు లేక ప్రమాదాలు

7లో

చట్టబద్ధంగా పిల్లల దత్తత

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం కలెక్టరేట్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): 'మిషన్ వాత్సల్య' ద్వారా పిల్లలను చట్టబద్ధంగా దత్తత ఇస్తామని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో జాతీయ దత్తత మాసోత్సవాల సందర్భంగా దత్తతపై అవగాహన పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ అర్హులైన వారు పిల్లల దత్తత కోసం మిషన్ వాత్సల్య వెబ్‌సైట్‌లో తప్పనిసరిగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

ఐసీడీఎస్ పీడీ విమల మాట్లాడుతూ దత్తత కోసం దరఖాస్తు చేసుకున్న వారికి సులభతర నిబంధనల ప్రకారం పిల్లలను అప్పగిస్తామన్నారు. దివ్యాంగ పిల్లలను కూడా దత్తత తీసుకుని, వారికి ఆప్యాయత, అనురాగాలు పంచిపెట్టాలని కోరారు. కార్యక్రమంలో బాలల రక్షణ అధికారి కె.వి.రమణ, ఐ.లక్ష్మీనాయుడు, శిశుగృహ మేనేజర్ కె.నరేష్, సంఘ సేవకుడు పి.రాంబాబు పాల్గొన్నారు.



పోస్టర్‌ను విడుదల చేస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ఏడేళ్ల బాలికపై వృద్ధుడి లైంగికదాడి

నరసన్నపేట, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ఏడేళ్ల బాలికపై ఓ కామాంధుడి కన్ను పడింది. ఆదివారం పాఠశాలకు సెలవు కావడంతో సరదాగా ఆడుకుంటున్న ఆ చిన్నారికి.. నరసన్నపేటకు చెందిన చల్ల రామ్మూర్తి అనే 70 ఏళ్ల వృద్ధుడు మాయమాటలు చెప్పి ఇంట్లోకి తీసుకెళ్లాడు. ఆయన భార్య బంధువుల ఇంటికి వెళ్లగా.. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆ చిన్నారిపై లైంగికదాడికి పాల్పడ్డాడు. గమనించిన ఓ వ్యక్తి చిన్నారి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చాడు. ఏమి జరిగిందని చిన్నారిని తల్లి అడగ్గా.. వృద్ధుడి నిజస్వరూపం బయటపడింది. వెంటనే వృద్ధుడిపై చిన్నారి కుటుంబ సభ్యులు దాడికి పాల్పడి.. ప్రశ్నించగా అక్కడి నుంచి పరారయ్యాడు. దీనిపై నరసన్నపేట పోలీసులకు బాలిక కుటుంబ సభ్యులు సోమవారం ఫిర్యాదు చేశారు. రామ్మూర్తిపై పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ దుర్గాప్రసాద్ తెలిపారు.

తప్పు చేశానన్న మనస్తాపంతో వివాహిత ఆత్మహత్య

శ్రీకాకుళం క్రైం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): వివాహేతర సంబంధం తప్పు అని తెలుసుకుని.. మనస్తాపం చెంది ఓ మహిళ ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటనకు సంబంధించి వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శ్రీకాకుళం కాకివీధికి చెందిన రాపాక లలితారాణి(25)కి.. ఎనిమిదేళ్ల కిందట ఓ వ్యక్తితో వివాహమైంది. ఈమెకు ఇద్దరు కుమార్తెలు. కాకివీధిలోని తండ్రి టిఫిన్ దుకాణంలో లలితారాణి పనిచేస్తూ ఉండేది. ఈక్రమంలో టిఫిన్ దుకాణానికి వచ్చే ఓ వ్యక్తితో ఆమెకు వివాహేతర సంబంధం ఏర్పడింది. ఈ విషయం భర్తకు తెలియడంతో కొన్ని నెలలుగా దూరంగా ఉంటున్నాడు. దీంతో లలితారాణి తల్లిదండ్రుల వద్దే ఉంటోంది. తాను చేసిన తప్పు తెలుసుకుని లలితారాణి తీవ్ర మనస్తాపం చెంది చనిపోవాలని నిర్ణయించుకుంది. సోమవారం తెల్లవారు జామున నాలుగున్నర ప్రాంతంలో ఇంట్లో ఉన్న తలకు రాసుకునే రంగు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. అనంతరం నొప్పి తాళలేక ఏడవడంతో లలితారాణి తల్లిదండ్రులు మేల్కొన్నారు. ఆమెను చికిత్స నిమిత్తం శ్రీకాకుళం సర్వజన ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని వన్‌టౌన్ ఎస్ఐ హరికృష్ణ తెలిపారు.

నాడు.. నేడు





నీరు - పైరు

ఈ చిత్రాలు చూశారా... శాసనం గ్రామం నుంచి రాజగోపాలపురం వెళ్లే రోడ్డులో ఇటీవల మొంథా తుఫాన్ ప్రభావంతో భారీ వర్షాలకు వరదనీరు చేరి వరిపంట పొలాలన్నీ చెరువులను తలపించాయి. వర్షాలు తగ్గుముఖం పట్టిన తర్వాత పంట పొలాల్లో నీటిని దేశబట్టి కాలువలోకి మళ్లించారు. ప్రస్తుతం ఎండలు కూడా కాస్తుండడంతో పొలాల్లో పచ్చని వరిపైరు దర్శనమిస్తోంది. అయితే ఈ వరి పండుతాదో.. లేదో అనేది ప్రశ్నార్థకమే. ఎందుకంటే నీటిలో ఐదు రోజులుగా పంటలు నానిపోయాయి. పంట దిగుబడి వచ్చినా అందులో పొల్లు ధాన్యమే అధికంగా ఉంటుందని రైతులు చెబుతున్నారు.

- పలాస, నవంబరు 10(ఆంధ్రజ్యోతి)



జలుమూరు: శ్రీముఖలింగేశ్వని దర్శనానికి బారులు తీరిన భక్తులు



జలుమూరు: శ్రీముఖలింగేశ్వర స్వామి

శివోహం

- శైవక్షేత్రాలకు పోటెత్తిన భక్తులు
- సందడిగా కార్తీక మాసం మూడో సోమవారం
- బందోబస్తు ఏర్పాటుచేసిన పోలీసు యంత్రాంగం

కార్తీక మాసం మూడో సోమవారం జిల్లాలోని శైవక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. వేకువజాము నుంచే ఆలయాల వద్ద భక్తులు బారులుతీరారు. హరహర మహదేవ శంభో శంకర అంటూ ఆలయాలు శివనామస్మరణతో మార్మోగాయి. శ్రీకాకుళం, ఆమదాలవలస నరసన్నపేట, జలుమూరు, టెక్కలి, పలాస, ఇచ్ఛాపురం, పాతపట్నం, తదితర పట్టణాలతోపాటు గ్రామాల్లోని శైవక్షేత్రాలు భక్తులతో కళకళలాడాయి. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు చేపట్టారు. వివిధ ఆలయాల వద్ద పోలీసులు బందోబస్తు ఏర్పాట్లు చేశారు.

-ఆంధ్రజ్యోతి బృందం



బూర్జ: కొరగాంలో ఉమాకోటి ఆత్మలింగేశ్వరస్వామికి అలంకరణ..



కోటబొమ్మాళి: చిన్న హరిశ్చంద్రపురంలో పంచధామ క్షేత్రం వద్ద..



టెక్కలి/రూరల్: ఎండల మల్లికార్జున స్వామిని దర్శించుకుంటున్న ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్



ఆమదాలవలస: సంగమేశ్వరాలయానికి పోటెత్తిన భక్తులు



పాతపట్నం: నీలకంఠేశ్వరుని ఆలయంలో .



టెక్కలి/రూరల్: రావివలసలో దర్శనానికి క్యూలో భక్తులు



అరసవల్లి: నాగావళి నదిలో సతీసమేతంగా దీపాలు విడిచిపెడుతున్న ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు



కంచిలి: పాతాళేశ్వరాలయం వద్ద బారులు తీరిన భక్తులు



అరసవల్లి: ఉమారుద్ర కోటేశ్వర స్వామి ఆలయంలో భక్తులకు సూచనలిస్తున్న అధికారులు



నరసన్నపేట: రామలింగేశ్వర స్వామి ఆలయం వద్ద..



అరసవల్లి: నాగావళిలో దీపాలు విడిచిపెడుతున్న మహిళలు




నందిగాం: శివాలయంలో దర్శించుకుంటున్న భక్తులు



హిరమండలం: కోటేశ్వరస్వామి ఆలయంలో లక్షదీపారాధన



కవిటి: బొరివంకలో తిరువీధిలో మహిళల కోలాటం



వయోడెక్ట్ పైనుంచి పడుతున్న నీరు

వయోడెక్ట్ పైనుంచి ప్రవహించిన నీరు

- వాటర్‌ఫాల్‌ను తలపించిన వైనం
- జలమయమైన పొలాలు

ఆమదాలవలస, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): వంశధార అధికారులు సోమవారం కుడి ప్రధాన కాలువ ద్వారా అధిక స్థాయిలో నీరు విడుదల చేయడంతో ఆమదాలవలసలో వయోడెక్ట్ కృత్రిక వాటర్‌ఫాల్ తలపించింది. పట్టణ సమీపంలోని గేదెలవానిపేట జంక్షన్ వద్ద వయోడెక్ట్‌పై నుంచి నీరు ప్రవహించింది. వయోడెక్ట్‌కు ఇరువైపులా నీరు అంచులను తాకి కిందకి వాటర్‌ఫాల్‌లా జారిపడింది. ఆమదాలవలస- నరసన్నపేట ప్రధాన రహదారికి ఆనుకొని ఉన్న వయోడెక్ట్ గేదెలవానిపేట జంక్షన్ వద్ద రహదారిపై నుంచి కిందకు నీరు పడడంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించే ప్రయాణికులు, వాహనచోదకులు తడిసిపోవల్సి వచ్చింది. మీ నుంచి కిందకు నీరు జారే విధానం వాటర్ ఫాల్స్ మాదిరిగా కనిపించడంతో ఆ ప్రాంతంలో ఉన్న ప్రజలతో పాటు రాకపోకలు సాగించే వాహనచోదకులు చూసేందుకు ఎగబడ్డారు. వయోడెక్ట్‌పై నుచి కొన్ని ప్రాంతాల్లో నీరు మీద నుంచి కిందకు రావడంతో పంట పొలాలన్నీ జలమయమయ్యాయి. దీంతో కోతకు వచ్చిన పంటపొలాల్లో నీరు చేరడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

జిల్లాలో హై అలర్ట్

(ఐదో పేజీ తరువాయి)

పాతపట్నం, రణస్థలం తదితర ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు. కొత్తవ్యక్తులు.. ఈ జిల్లాతో సంబంధంలేని వ్యక్తులు తారసపడితే క్షుణ్ణంగా వివరాలను నమోదు చేస్తున్నారు. శ్రీకాకుళం-ఒడిశా సరిహద్దుల నుంచి వచ్చిపోయే వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. చెక్‌పోస్టుల వద్ద హైవే పెట్రోలింగ్, ఏపీఎస్పీ సిబ్బంది తనిఖీలు ముమ్మరం చేశారు. రాత్రివేళ ప్రయాణం చేస్తున్న వాహనదారులు.. ప్రయాణీకులు.. ఒక్కసారిగా పోలీసులు తనిఖీలు చేస్తున్నారేంటనుకుని ఆశ్చర్యపోతున్నారు. పలు ప్రాంతాల్లో తనిఖీలను ఎస్పీ, డీఎస్పీలు పర్యవేక్షించారు. అనుమానాస్పద వ్యక్తులెవరైనా తారసపడితే సమాచారం ఇవ్వాలని ఎస్పీ సూచించారు.

అమ్మో.. 'సికెల్ సెల్ ఎనీమియా'

(ఐదో పేజీ తరువాయి)

చేయాల్సి ఉంటుంది. ఇందుకుగాను సికెల్ సెల్ ఎనీమియా రోగులకు ప్రభుత్వం రూ.10వేలు చొప్పున పింఛన్ కూడా చెల్లిస్తోంది. ఒక తరం నుంచి మరో తరానికి సికెల్ సెల్ ఎనీమియా వ్యాధి సంక్రమించకుండా జన్యుపరంగా వ్యాధి వచ్చే అవకాశాలను.. అలాగే తొలితరం క్యారియర్లను గుర్తించి వారి మధ్య వివాహాలు జరగకుండా చేయాలి. గ్రామీణ.. గిరిజన ప్రాంతాల్లో భారీగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. గిరిజన ప్రాంతాల్లో నిరంతర స్క్రీనింగ్ డ్రైవ్‌లు నిర్వహించాలి. పాఠశాలలు, కళాశాలల్లో పరీక్షలు.. కౌన్సెలింగ్ చేయాలి. క్యారియర్ ఉన్న వారు వైద్య పర్యవేక్షణలో ఉండటం మంచిది. జిల్లాలో ఇప్పుడు తీసుకునే చర్యలే.. రాబోయే పదేళ్ల ఆరోగ్య ప్రమాదాన్ని తగ్గించగలవని వైద్యులు చెబుతున్నారు.

ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్ట్ ఇవ్వండి

- హరిశ్చంద్రపురం రైల్వేస్టేషన్ పరిసర గ్రామాల ప్రయాణికుల వినతి



హరిశ్చంద్రపురం రైల్వే స్టేషన్

కోటబొమ్మాళి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): జిల్లాలోనే జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న ఏకైక రైల్వేస్టేషన్ హరిశ్చంద్రపురం రైలు నిలయం. ఈ రైల్వే స్టేషన్ నుంచి అటు విజయనగరం, విశాఖ, ఇటు పలాస, బరంపురం తదితర ప్రాంతాలకు కోటబొమ్మాళి, సరసన్నపేట, టెక్కలి, సారవకోట, పోలాకి మండలాల ప్రజలు నిత్యమూ రాకపోకలు సాగిస్తుంటారు. ఈ రైలు నిలయంలో ప్లాట్ ఫారం, ఫుట్‌పాత్ ఓవర్ బ్రిడ్జి, విద్యుత్ ఆధునికీకరణ తదితర మౌలిక సదుపాయాలు కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు ఎంపీ నిధులతో కల్పించారు. ఈ రైలు నిలయంలో గుణుపూర్ పాసింజర్‌తో పాటు విశాఖ, ఇంటర్ సీటి, పూరి-తిరుపతి ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిలుపుదల చేయకపోవడంతో ఈ ప్రాంతవాసులు ఇబ్బందిపడుతున్నారు. ఉద్యోగులు, వ్యాపారులు, విద్యార్థులు, వివిధ వర్గాల ప్రజలు ఇక్కడి నించి నిత్యమూ పలు ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటారు. ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్ట్ ఇవ్వాలని ఎన్నో ఏళ్లుగా రైల్వే ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులకు వినతులు ఇస్తూనే ఉన్నా ఫలితం లేకపోతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఎంపీ రామ్మోహన్ నాయుడుతో కలిసి రైల్వే జీఎం ఈ స్టేషన్ అభివృద్ధి పనులు పరిశీలనకు వచ్చినప్పుడు చుట్టు పక్కల గ్రామాల ప్రజలతోపాటు, ప్రజాప్రతినిధులు ఇక్కడ ఎక్స్‌ప్రెస్ రైళ్ల నిలుపుదల చేయాలని వినతి పత్రాలు అందజేశారు. కొన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్ల నిలుపుదలకు చర్యలు తీసుకుంటానని రైల్వే అధికారులు హామీకూడా ఇచ్చారు. కానీ అవన్నీ హామీలగానే మిగిలిపోయిందని పలువురు ప్రయాణికులు వాపోతున్నారు.

ఎన్ని వినతులిచ్చినా అంతే..

ప్రయాణిలకులకు ఎంతో సౌకర్యంగా ఉన్న హరిశ్చం ద్రపురం రైలు నిలయంలో విశాఖ, పూరి-తిరుపతి, ఇంటర్‌సిటి ఎక్స్‌ప్రెస్‌లు, గుణుపూర్ పాసింజర్ ఆపాలని ఎన్నో ఏళ్లుగా స్థానికులు కోరుతున్నా పట్టించుకునే నాథుడే కరవయ్యారు. హైదరాబాద్, విజయవాడ, తిరుపతి, భువనేశ్వర్, చైన్నై తదితర ప్రాంతాలకు వెళ్లే ఎక్స్‌ప్రెస్ ఇక్కడ హాల్ట్ లేకపోవడంతో ఈ ప్రాంతవాసులు ఆమదాలవలస, పలాస రైల్వే స్టేషన్లకు వెళ్లి రైలు ఎక్కాల్సి వస్తుందని వాపోతున్నారు. గుణుపూర్ పాసింజర్ ఇక్కడ నిలుపుదల చేస్తే రూ.50 లకే విశాఖ చేరుకోవచ్చునని, అదే ఆర్టీసీ బస్‌లో వెళితే రూ.250 వరకు టిక్కెట్ ఉంటుందని, అందువల్ల ఈ రైలు నిలుపుదలకు ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలని ప్రయణికు లు కోరుతున్నారు.

అభివృద్ధి జరిగింది



ఈ రైల్వే స్టేషన్ అభివృద్ధిచేసి ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిలుపుదల చేయాలని కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడుతో కలిసి రైల్వే అధికారులకు చాలా సార్లు వినతి పత్రాలు అందజేశాం. చివరకు రామ్మోహన్‌నాయుడు చొరవతో స్టేషన్‌కు అన్ని మౌలిక సదుపాయాలు కల్పించడం జరిగింది. కానీ ఎక్స్‌ప్రెస్ రైలు మాత్రం ఇంకా ఆపడం లేదు. ఈ దిశగా రైల్వే అధికారులు చర్యలు తీసుకుంటే ఈ ప్రాంత వాసులకు ఎంతో మేలు కలుగుతుంది.

- పూజారి శైలజ, మాజీ సర్పంచ్, హరిశ్చంద్రపురం

కార్పొరేషన్లకు బోర్డు డైరెక్టర్ల నియామకం

- ప్రభుత్వ ఉత్తర్వులు జారీ
- జిల్లాలో పలువురు నాయకులకు అవకాశం

శ్రీకాకుళం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పలు నామినేటెడ్ పోస్టులను భర్తీ చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు పది కార్పొరేషన్లకు బోర్డు డైరెక్టర్లను నియమిస్తూ ఉత్తర్వులను జారీచేసింది. జిల్లాకు చెందిన కూటమి నేతలకు డైరక్టర్ల పదవులు లభించాయి. డైరక్టర్లగా నియమితు లైన వారిని ఆయా నియోజకవర్గ ఎమ్మెల్యేలు అభినందించారు.

● ఏపీ సూక్ష్మచిన్న మధ్యతరహా పరిశ్రమల అభివృద్ధి బోర్డు డైరెక్టర్‌గా శ్రీకాకుళం నగరానికి చెందిన టీడీపీ నాయకుడు ప్రధాన విజయరామ్‌కు అవకాశం లభించింది.

● ఏపీ రాష్ట్ర ఎస్సీ కమిషన్ డైరెక్టర్‌గా ఎచ్చెర్ల నియోజకవర్గానికి చెందిన టీడీపీ నాయకుడు ముక్కు ఆదినారాయణ నియమితులయ్యారు.

● ఏపీ రాష్ట్ర కళింగ వైశ్య వెల్ఫేర్ అండ్ డవలప్‌మెంట్ బోర్డు డైరెక్టర్లగా జిల్లాలో ఏడుగురికి అవకాశం లభించింది. టీడీపీ నాయకులు బి. శ్రీకాంత్ (ఇచ్ఛాపురం), దుంప గోవిందరావు(టెక్కలి), జామి వెంకటరావు (నరసన్నపేట), పొట్నూరు కృష్ణమూర్తి(శ్రీకాకుళం), పొట్నూరు రమేష్(ఆమదాలవలస), రవిశంకర్ గుప్తా (పలాస), పూన సంతోష్(ఇచ్ఛాపురం) బోర్డు డైరక్టర్‌లుగా నియమితులయ్యారు.

● ఏపీ నాగవంశం వెల్ఫేర్ అండ్ డవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్లగా పాతపట్నం నియోజకవర్గానికి చెందిన టీడీపీ నాయకుడు ఆకంద సన్యాసిరావు, బుర్లె లలితకుమారి, ఆమదాలవలస నియోజకవర్గానికి చెందిన టీడీపీ నాయకురాలు అంకేపల్లి విజయలక్ష్మి నియమితులయ్యారు.

అర్జీల పరిష్కారానికి సత్వర చర్యలు

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



గ్రీవెన్స్‌లో అర్జీదారుల సమస్యలను వింటున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం కలెక్టరేట్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): అర్జీల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. స్థానిక జడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన వారి నుండి 102 అర్జీలను స్వీకరించారు. అర్జీదారులు సంతృప్తి చెందేలా, పూర్తి క్షేత్రస్థాయి పర్యవేక్షించి సమస్యలకు పరిష్కారం చూపాలన్నారు. అసిస్టెంట్ కలెక్టర్ పృధ్వీరాజ్‌కుమార్, ఇన్‌చార్జి డీఆర్వో లక్ష్మణమూర్తి, డిప్యూటీ కలెక్టర్లు పద్మావతి, జయదేవి, డీఆర్డీఏ పీడీ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

దాడిచేసిన వారిపై చర్యలు తీసుకోవాలి..

ఇంటి తలుపులు బద్దలుకొట్టి తనపై, తన భర్త, కుమార్తె దాడి చేసి తీవ్రంగా కొట్టారని, ఇంట్లోని రెండు తులాల బంగారం, రూ.35 వేల నగదు తీసుకుపోయారని, వారిపై చర్యలు తీసుకుని రక్షించాలని లావేరు మండలంలోని అదపాక గ్రామానికి చెందిన సవలాపురపు యమున దంపతులు కలెక్టర్‌ను విన్నవించారు.

తక్కువ జీతం ఇస్తున్నారు..

ప్రతి నెలా ఇవ్వాల్సిన జీతం కంటే తక్కువ చెల్లిస్తున్నారని, ఈపీఎఫ్ ఖాతాలో కూడా తక్కువ జమ చేస్తున్నారని విద్యుత్ మీటర్ రీడర్లు వాపోయారు. కాంట్రాక్టరును అడిగితే అసభ్య పదజాలంతో దూషిస్తూ, దురుసుగా ప్రవర్తిస్తున్నారని తెలిపారు. ఈ మేరకు తమకు న్యాయం చేసి ఆదుకోవాలని మీటర్ రీడర్లు సోమవారం గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు వినతపత్రం సమర్పించారు.

పదోన్నతులు కల్పించి న్యాయం చేయాలి

ఉపాధిహామీ పథకంలో క్షేత్రస్థాయిలో పని చేస్తున్న తమకు జీతాలు పెంచాలని, పదోన్నతులు కల్పించాలని టెక్నికల్ అసిస్టెంట్లు కోరారు.ఈ మేరకు గ్రీవెన్స్‌లో డ్వామా పీడీ సుధాకర్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం తమ సమస్యలపై సానుకూలంగా స్పందించి, ఆదుకోవాలని వారు కోరారు.



బాధితులతో మాట్లాడుతున్న మహేశ్వరరెడ్డి

సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం: ఎస్పీ

శ్రీకాకుళం క్రైం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారం పోలీస్‌శాఖకు అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి తెలిపారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదులు స్వీకరణ, పరిష్కార కార్య క్రమాన్ని నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితులు తమ ఫిర్యాదులు ఎస్పీకి నేరుగా అందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రతి పోలీస్ అధికారి ప్రజా ఫిర్యాదులపై బాధ్యతగా వ్యవహరించి పరిష్కార చర్యలు చేపట్టి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆయా ఫిర్యాదులపై తీసుకున్న చర్యలు నివేదిక రూపంలో జిల్లా పోలీస్ కార్యాలయంలో అందించాలని స్పష్టం చేశారు. కుటుంబ, ఆస్తి, వ్యక్తిగత, మోసపూరితమైన వంటి వివిధ అంశాలపై 53 ఫిర్యాదులు స్వీకరించారు.

మునిసిపాలిటీ అభివృద్ధికి కృషి

● పీయూసీ చైర్మన్ కూన రవికుమార్



పనులను పరిశీలిస్తున్న రవికుమార్

ఆమదాలవలస, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీ అభివృద్ధికి ప్రత్యేక కృషి చేయనున్నట్లు పీయూసీ చైర్మన్, ఎమ్మెల్యే కూన రవికుమార్ తెలిపారు.సోమవారం మునిసిపాలిటీలోని 17వ వార్డు పూజారిపేట సాయన్నక్వార్టర్స్ పరిధిలో జరుగుతున్న పలుఅభివృద్ధి పనులు పరిశీలించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంట్రాక్టర్లు పనులు వేగవంతం చేయడంతోపాటు ఎటువంటి నాణ్యత లోపం లేకుండా పూర్తి చేయాలని కోరారు. ఐదేళ్ల వైసీపీపాలనలో పట్టణంలోని పలు వార్డుల్లో ఎటువంటి అభివృద్ధి పనులు చేపట్టలేదని ఆరోపించారు. దీంతో రహదారులు, డ్రైనేజీలు శిథిలావస్థకు చేరాయని, మురుగునీరు రహదారిపై ప్రవహించడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. పనులు జరుగుతున్న ప్రాంతాల్లో రవికుమార్ స్కూటీపై పర్యటించారు. కార్యక్రమంలో జనసేన కన్వీనర్ పేడాడ రామ్మోహన్, టీడీపీ నాయకులు కూన ఆంజనే యులు, పీవీకే రాజు పాల్గొన్నారు.

కష్టపడిన వారికి ప్రాధాన్యం

● టీడీపీ సంస్థాగత ఎన్నికల పరిశీలకుడు బాబూరావు



మాట్లాడుతున్న బాబూరావు

కవిటి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి):పార్టీకోసం కష్టపడిన వారికి ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు ఇచ్ఛాపురం నియోజకవర్గ పార్టీ సంస్థాగత ఎన్నికల పరిశీలకుడు, రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు తెలిపారు. పార్టీకి కార్యకర్తలే నాయకులని చెప్పారు. రామయ్యపుట్టుగలో ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బి.అశోక్‌తో కలిసి పార్టీ సంస్థాగత ఎన్నికలపై సోమవారం చర్చించారు.ఈసందర్భంగా నియోజకవర్గ ముఖ్యనాయకులతో మాట్లాడారు. పార్టీ రాష్ట్రంలో అధికారంలో ఉండాలంటే గ్రామస్థాయి నుంచి సంస్థాగత ఎన్నికల్లో యువకులు, మహిళలకు అవకాశం కల్పించాలని బాబురావు కోరారు. గ్రామస్థాయి నుంచి ప్రజాభిప్రాయం తీసుకొని మాత్రమే పదవులు ఇవ్వనున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో గ్రామ, మండల, వార్డు స్థాయి కమిటీలను త్వరగా పూర్తిచేయాలని కోరారు.

హ్యాండ్‌బాల్ పోటీలకు ముగ్గురి ఎంపిక



హ్యాండ్‌బాల్ రన్నరప్ ట్రోఫీ అందుకుంటున్న జిల్లా క్రీడాకారులు

శ్రీకాకుళం స్పోర్ట్స్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): జిల్లాకు చెందిన ముగ్గురి బాలికలు జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-17 హ్యాండ్‌బాల్ బాలికల రాష్ట్రస్థాయిపోటీల్లో జిల్లాకుచెందిన క్రీడాకారులు ప్రతిభకనబరిచి ద్వితీయస్థానం కైవాసం చేసుకున్నారు. ఎన్టీఆర్ జిల్లా పటమట కేబీసీ జడ్పీ హైస్కూల్‌లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీలు ఈనెల ఎనిమిదో తేదీ నుంచి సోమవారం వరకుజరిగాయి.ఫైనల్‌లో హోరాహోరీగా తలపడినా ద్వితీయ స్థానంతో సరిపెట్టుకోవల్సి వచ్చింది.నారువ జడ్పీహెచ్ఎస్‌కు చెందిన మౌనిక, శ్రీకాకుళం ఉమెన్స్ కళాశాల విద్యార్థిని దివ్య, శ్రీకాకుళం లోని ఓ ప్రైవేటుస్కూల్‌కు చెందిన జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఆ జట్టుకు కోచ్‌గా ఆర్.సతీష్‌రాయుడు వ్యవహరించారు.

కబడ్డీలో సత్తాచాటిన బాలిబాలికల జట్లు

గుజరాతీపేట, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): కడపలో ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి కబడ్డీపోటీల్లో బాలబాలికలు జట్లు సత్తాచాటాయి.ఈ మేరకు ప్రథమ, ద్వితీయస్థానాలు సాధించాయి. కాగా ఆయా జట్ల సభ్యులు శ్రీకాకుళంలోని విశాఖ ఎ కాలనీలోగల టీడీపీ కార్యాలయంలో సోమవారం మ్మెల్యే గొండు శంకర్ కలిశారు. కార్యక్రమంలో జిల్లా కబడ్డీ సంఘం ప్రతినిధులు రామకృష్ణ, ముసలినాయుడు, ఎస్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రెజ్లింగ్ పోటీల్లో కాంస్య పతకం

బూర్జ, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి):మండలంలోని ఓవీపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న గిరడ మాధురి రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీల్లో సత్తా చాటి మూడో స్థానంలో నిలిచింది.ఇటీవల విజయవాడలో జరిగిన స్కూల్ గేమ్స్‌లో అండర్-14 విభాగం తరఫున మాధురి కాంస్యపతకాన్ని సాధించింది.ఈ మేరకు సోమవారం మాధురితోపాటు పీడీ ఎన్.సురేష్‌కుమార్‌కు హెచ్ఎం కృష్ణవేణి అభినందించారు.

కవిటిలో ఉపాధి గ్రామసభ

కవిటి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): కవిటి పంచాయతీలో 2026-27 సంవత్సరంలో ఉపాధిహామీ పనులు ఎంపికకు సోమవారం గ్రామసభను నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ పరిధిలో 85లక్షలు వరకు పనులు నిర్వహించాలని గుర్తించారు. కూలీలకు ఉపాధి కల్పించడమే కాకుండా ఆయా పనులు అందరికీ ఉపయోగపడేలా ఉండాలని సర్పంచ్ పి.లక్ష్మణరావు కోరారు.సమావేశంలో ఏపీవో టి.మోహన్, మాజీసర్పంచ్ ఎ.మధు, బి.రమేష్, డి.ధర్మారావు, దుర్యోధన, వి.రంగారావు పాల్గొన్నారు.

● లావేరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గురుగుబిల్లి పంచాయతీలో 2026-27 ఆర్థిక సంవత్సరానికి ఉపాధి పనుల గుర్తింపునకు గ్రామసభను సోమవారం నిర్వహించారు.ఈసందర్భంగా సర్పంచ్ బాడిత కళ్యాణి లక్ష్మణరావు మాట్లాడుతూ చెరువు పనులతో పాటు వ్యక్తిగతంగా ఉపయోగపడే హార్టికల్చర్ తదితర పనులకు ఉపాధి హామీ పథకం వర్తిస్తుందని చెప్పారు.టీఏ గౌరి నాయుడు మాట్లాడుతూ వచ్చే ఏడాదికి పంచాయతీలో సుమారుగా రూ.85లక్షల విలువగల ఉపాధిపనులను చేపట్టవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పి.భవానీ, ఎఫ్ఏ రామారావు పాల్గొన్నారు.

బకాయి వేతనాలు చెల్లించాలి

శ్రీకాకుళం రిమ్స్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): రిమ్స్ అధికారులు సెక్యూరిటీ సిబ్బంది సెప్టెంబరు, అక్టోబరు నెలల వేతన బకాయిలను చెల్లించాలని సీఐటీయూనగర కన్వీనర్ రట్టిప్రకాశరావు డిమాండ్ చేశారు. సోమవారం రిమ్స్ ఆసుపత్రి వద్ద సీఐటీయూఆధ్వర్యంలో తమ పెండింగ్ వేతనాలు తక్షణమే చెల్లించాలని సెక్యూరిటీసిబ్బంది నిరసన ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు సూర్యనారాయణ, శ్రీను, వెంకటరమణ, లక్ష్మణరావు, అప్పన్న,రాజేంద్ర, బద్రీరావు, సతీష్, పద్మ, రాజేశ్వరి, సంతోషి, బండారమ్మ పాల్గొన్నారు.



నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న సెక్యూరిటీ సిబ్బంది

స్పీడ్‌బ్రేకర్లు లేక ప్రమాదాలు

● హెచ్చరిక బోర్డులు ఏర్పాటుకు నోచుకోని వైనం

● ఇదీ మలువుల వద్ద పరిస్థితి



వజ్రపుకొత్తూరు: నగరంపల్లి రోడ్డులో ఓ మలుపు

జిల్లాలోని పలు చోట్ల మలుపుల వద్ద స్పీడ్ బ్రేకర్లు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. దీనికి తోడు రోడ్డుకు ఇరువైపులా తుప్పలు ఏపుగా పెరగడంతో దగ్గరకు వచ్చే వరకూ వాహనాలు కనిపించకపోవడంతో ఢీకొని పలువురు ఆస్పత్రి పాలవుతున్నారు.

● కొత్తూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): వసప- మెట్టూరు రహదారిలో కొండ వద్ద మలుపు ప్రమాదాలకు నిలయంగా మారింది. నివగాం, ఒడిశా వైపు రాకపోకలతో ఈ రహదారి నిత్యం రద్దీగా ఉంటోంది. మలుపు వద్ద ద్విచక్రవాహనాలు ఢీకొని పలువురు గాయపడుతున్నారు.ఈ మార్గంలో ఆర్‌అండ్‌బీ అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని పలువురు చోదకులు కోరుతున్నారు.

● వజ్రపుకొత్తూరు, నవంబరు 10: నగరంపల్లి రోడ్డులో మలుపు వద్ద నిత్యం వాహనాలు ఢీకొని ప్రమాదాలు జరుగుతున్నాయి. మండల కేంద్రానికి పలు గ్రామాల ప్రజలు ఈ మార్గంలోనే చేరుకుంటున్నారు. దీనికితోడు ఈ మార్గంలో అడుగడుగునా గోతులమయం కావడంతో వాహనచోదకులు అగచాట్లకు గురవుతున్నారు. ఈ మార్గంలో ఆరు మలుపులు ఉన్నాయి. ఈ మార్గంలో పెదబాడం, చినబాడం మీదుగా పలాస-కాశీబుగ్గ జంటపట్టణాలకు నిత్యం 20 గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు.



కొత్తూరు: వసప-మెట్టూరు రహదారిపై ప్రమాదకర మలుపు

తెలుగు అధ్యయనానికి సీపీ బ్రౌన్ అంకితం

ఎచ్చెర్ల, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో సీడెడ్ జిల్లాల కలెక్టర్‌గా నియమితులైన సీపీ బ్రౌన్ తెలుగు భాషను నేర్చుకుని జీవితమంతా తెలుగు అధ్యయనానికి అంకితం చేశారని వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజని తెలిపారు. సోమవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీలో తెలుగు భాషాభివృద్ధికి ఎనలేని కృషిచేసిన ఆంగ్లేయ అధికారి సీపీ బ్రౌన్ 227వ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రౌన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి.అడ్డయ్య, వర్సిటీ ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎం.అనూరాధ, డాక్టర్ సీహెచ్ రాజశేఖరరావు, డాక్టర్ కె.స్వప్నవాహిని పాల్గొన్నారు.

వర్సిటీ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్‌గా స్వప్నవాహిని

ఎచ్చెర్ల, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ సైన్స్ కళాశాల నూతన ప్రిన్సిపాల్ (ఎఫ్ఏసీ)గా బయోటెక్నాలజీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కె.స్వప్నవాహిని నియమితులయ్యారు. ఈమేరకు సోమవారం ఆమెకు నియామక పత్రాన్ని వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజని అందజేశారు. ఈ పదవిలో ఆమె మూడేళ్లపాటు కొనసాగుతారు.2008లో ఏర్పడిన బీఆర్ఏయూలో పదేళ్లతర్వాత 2018లో సైన్స్ కోర్సులకు ప్రత్యేక కళాశాల ఏర్పాటైంది. ఈ కళాశాలకు డాక్టర్ స్వప్నవాహిని మూడో ప్రిన్సిపాల్‌గా వ్యవహరించనున్నారు. 2010లో బీఆర్ఏయూలో స్వప్నవాహిని అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా కేరీర్ ప్రారంభించి వివిధ హోదాల్లో పనిచేశారు.

పెంటలో వీరభద్రస్వామి తిరువీధి



వీరభద్రస్వామిని తిరువీధి నిర్వహిస్తున్న దృశ్యం

జి.సిగడాం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): పెంటలో కురివి వీరభద్రస్వామి తిరువీధిని సోమవారం నిర్వహించారు. కార్తీక మూడో సోమవారం పురస్కరించుకొని వీరభద్ర స్వామి వారికి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అంగరంగ వైభవంగా మేళతాళాల మధ్య ఊరేగించారు. గౌరీదేవి నోములునోచారు. ఈసందర్భంగా సాంస్కృతిక, జానపద కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో అలుగోలు, సింహాద్రి పాల్గొన్నారు.

16న వ్యవస్థల కాషాయికరణపై సదస్సు

ఆమదాలవలస, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలోని అంబేడ్కర్ విజ్ఞాన మందిరంలో ఈనెల 16న రాజ్యాంగ వ్యవస్థల కాషాయికరణపై సదస్సు నిర్వహించనున్నట్లు కేఎన్‌పీఎస్ జిల్లా సహాయ కార్యదర్శి రాకోటి రాంబాబు తెలిపారు. సోమవారం మండలంలోని బెలమాంలో కుల నిర్మూలన పోరాట సమితి ఆధ్వర్యంలో కాషాయకరణ సదస్సుకరపత్రాలను ఆవిష్కరించారు.కార్యక్రమంలో మిస్క కృష్ణయ్య, అప్పన్న, రామారావు, నారాయణరావు, సూర్యనారాయణ, సావిత్రి, జానకమ్మ, సీతమ్మ, పద్మావతి పాల్గొన్నారు.

ఆలయ కమిటీలు అప్రమత్తంగా ఉండాలి

లావేరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసంలో ఆలయాలకు భక్తులు తాకిడి దృష్ట్యా గ్రామాల్లోఆలయ కమిటీలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ జీఎల్‌వీ శ్రీనివాసరావు కోరారు. సోమవారం లావేరు తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో ఆలయాల కమిటీ సభ్యులు వీఆర్వోలు, పంచాయతీకార్యదర్శులు, మహిళా పోలీసులతో సమీక్షించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఆలయాలకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆలయాల వద్ద సీసీ కెమె రాలను ఏర్పాటు చేయాలని తెలిపారు. పిక్నిక్‌లు జరిగే ప్రదేశాల్లో కూడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో పి.వెంకటరాజు, ఎస్ఐ జి.లక్ష్మణరావు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

శ్రీకాకుళం రూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): రూరల్ మండలంలోని రాగోలు జెమ్స్ కళాశాలలో బొల్లినేని మెడిస్కిల్స్ ఆధ్వర్యంలో విశాఖలోని హెచ్‌పీసీఎల్ స్కిల్ డెవలప్‌మెంట్ ఇనిస్టిట్యూట్‌లో నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ ఇచ్చి ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నట్లు జెమ్స్ కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్‌నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు హెల్త్‌కేర్ గివింగ్ అసిస్టెంట్, వెల్‌నెస్ థెరపిస్ట్ కోర్సుల్లో ఈనెల 17 నుంచి శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. పదోతరగతి, ఇంటర్ పాసై, 18 నుంచి 30 ఏళ్లలోపు యువతీ, యువకులు అర్హులని తెలిపారు. శిక్షణతోపాటు ఉచితంగా భోజనం, వసతి సదుపాయం కల్పించి కార్పొరేట్ ఆసుపత్రిల్లో ఉద్యోగాలు కల్పిస్తామని పేర్కొన్నారు. వివరాల కోసం 7989841464 నంబరు సంప్రదించాలని, ఆసక్తి గల యువతీ యువకులు ఈనెల 16లోగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు.

వాకలవలసలో ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం



ప్లాస్టిక్ నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

అరసవల్లి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి):వాకలవలసలో శ్రీకాకుళంలోని ఆర్ట్స్ కళాశాల రోడ్డులో గల కాకినాడ ఆదిత్య డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు సోమవారం ప్రత్యేక సేవా శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వాకలవలస పంచాయతీ కార్యాలయపరిసరాలు, వీధులను శుభ్రంచేసి, మొక్కలనునాటారు. అనంతరం విద్యార్థులు ప్లాస్టిక్ నిర్మూలన ర్యాలీని నిర్వహించారు. ప్లాస్టిక్ ముప్పు, నివారణా మార్గాలను తెలియజేస్తూ విద్యార్థులు నినాదాలుచేశారు. ఈసందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రతిరోజూ కొన్ని లక్షల టన్నుల ప్లాస్టిక్ వినియోగం జరుగుతోందని, దీంతో మానవాళి భవిష్యత్ ప్రమాదంలో పడుతుందని ఆందోళనవ్యక్తంచేశారు. ఈ శిబిరం ద్వారా ప్రజలలో అవగాహన తీసుకురావడమే తమ లక్ష్యమని చెప్పారు.

ఎంవీ చట్టంపై అవగాహన అవసరం

● న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి హరిబాబు



మాట్లాడుతున్న హరిబాబు

శ్రీకాకుళం లీగల్, నవంబరు10 (ఆంధ్రజ్యోతి): మోటారు వాహన చట్టంపై వాహనచోదకులు అవగాహన పెంచుకోవలసిన అవసరం ఉందని న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.హరిబాబు తెలిపారు. సోమవారం స్థానిక న్యాయసేవాధికార సంస్థ కార్యాలయంలో మోటారు వాహన చట్టంపై అవగాహన కార్యక్రమం ఏర్పాటుచేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నడుపుతున్న వాహనాలకు రిజిస్ట్రేషన్,ఫిట్‌నెస్ తప్పనిసరిగా ఉండాలన్నారు. ప్రమాదాలు జరిగే సమయంలో వాహనాలకు బీమా లేకపోవడంతో కోర్టుల్లో కేసులు త్వరగా పరిష్కారానికి నోచుకోవడం లేదని తెలిపారు. అతివేగం, అర్హత లేకున్నా వాహనాలు నడపడం ప్రమాదాలకు కారణాలని చెప్పారు. మద్యం తాగి వాహనాలు నడిపితే 10వేల రూపాయలు జరిమాన విధించనుననట్లు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ ఎ. విజయసారధి, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ గంగాధర్, ఆర్టీసీ డిప్యూటీ మేనేజర్ సంతోష్‌కుమార్, న్యాయవాదులు ఇందిరాప్రసాద్,ఆఫీసు నాయుడు, ప్రైవేటు బస్సుల డ్రైవర్లు,ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు

సొంత స్థలం ఉంటే ఇంటిని నిర్మించుకోచ్చు

ఇచ్ఛాపురం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి ఆవాస్ యోజన గ్రామీణ ఆవాస ప్లస్ కింద సొంత స్థలం ఉంటే ఇంటిని నిర్మించుకోవచ్చని సోషల్ డెవలప్‌మెంట్ స్పెషలిస్ట్ సీహెచ్ మల్లేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు.ఈనెల 30లోగా స్థలం ఉన్నట్లు ఎల్‌పీసీ, రిజిస్టర్ డాక్యుమెంట్, కుల, ఆదాయ సర్టిఫికెట్లు, బ్యాంక్ ఖాతా, ఆధార్ నెంబర్‌తో సచివాలయ పరిధిలో గల ఇంజనీరింగ్ అసిస్టెంట్ కలిసి అప్‌లోడ్ చేసుకోవాలని పేర్కొన్నారు.

బయోగ్యాస్ ప్లాంట్‌తో ఉద్యోగావకాశాలు: ఆర్డీవో

జి.సిగడాం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): బయోగ్యాస్ ప్లాంట్ ఏర్పాటుచేస్తే ఉద్యోగావకాశాలు లభిస్తాయని శ్రీకాకుళం ఆర్డీవో సాయి ప్రత్యూష తెలిపారు. సోమవారం మండలంలోని సంతవురిటి సమీపంలో బయోగ్యాస్ ప్లాంట్ నిర్మాణానికి స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రూ. 100 కోట్లతో నిర్మించనున్న బయోగ్యాస్ ప్లాంట్‌కు త్వరలో భూమి పూజ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఈఈ పొగిరి సుగుణాకరరావు, తహసీల్దార్ ఎం.సరిత, ఎంపీడీవో గుంటముక్కల రామకృష్ణ, ఆర్ఐ రాధ, వీఆర్వో ఉమామహేశ్వరరావు, నాయకులు బాల బొమ్మ వెంకటేశ్వర రావు, పలిశెట్టి సూర్యానారాయణ పాల్గొన్నారు.

సిక్కోలు పుస్తక మహోత్సవాన్ని విజయవంతం చేయాలి

ఆమదాలవలస, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలోని ఏడురోడ్లజంక్షన్ వద్ద ఉన్న ఎన్టీఆర్ మునిసిపల్ హైస్కూల్ గ్రౌండ్స్‌లో మంగళవారం నుంచి ఈనెల 20 వరకు జరగనున్న సాహిత్య సాంస్కృతిక వైజ్ఞానిక సంబరాలు, సిక్కోలు పుస్తక మహోత్సవాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు కె.నాగమణి పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలోని కృషివిజ్ఞానకేంద్రం వద్ద వ్యవసాయ పరిశోధనా స్థానం కాంట్రాక్ట్ సిబ్బందితో కలిసి సిక్కోలు పుస్తక మహోత్సవంపోస్టర్‌ను విడుదల చేశారు.కార్యక్రమంలో వ్యవసాయ పరిశోధనస్థానం కాంట్రాక్ట్ సిబ్బంది చిట్టిబాబు,గణపతి, సూరి, త్రివేణి, సునీత పాల్గొన్నారు.

ఘనంగా నందోత్సవం

ఇచ్ఛాపురం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురంలో కార్తీకమాసం చివరి సోమవారం కావడంతో భక్తి శ్రద్ధలతో శివాలయాల్లో పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా గొల్లవీధిలో గల చిదంబరేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు అనంతం కంచుతో తయారు చేసిన నంది విగ్రహాన్ని రథంపై తిరువిధి నిర్వహించి ఘనంగా నందోత్సవం జరిపారు.

నేడు వర్చువల్‌లో సీఎం ఎఫ్ఎఫ్‌సీ భవనం ప్రారంభం



పైడిభీమవరంలో ఎఫ్ఎఫ్‌సీ భవనాన్ని పరిశీలిస్తున్న స్వప్నిల్ దినకర్ పుండ్కర్

రణస్థలం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): పైడిభీమవరం పారిశ్రామిక వాడలోగల ఎఫ్ఎఫ్‌సీ భవనాన్నిముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మంగళవారం ప్రకాశం జిల్లా నుంచి వర్చువల్‌లో ప్రారంభించనున్నారు. ఇక్కడి పారిశ్రామిక వాడలో ఇటీవల ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్(ఎఫ్ఎఫ్‌సీ) పనులు పూరయ్యాయి. ఈ భవనం పనులను సోమవారం కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పరిశీలించారు.

కామర్స్‌తో ఉద్యోగావకాశాలు

గుజరాతీపేట, నవంబరు 10(ఆంధ్రజ్యోతి):విద్యార్థులు కామర్స్‌నేర్చుకోవడం ద్వారా ఉద్యోగవకాశాలు మెరుగ్గా ఉన్నాయని చార్టెడ్ అకౌంటెంట్ బి.రవికుమార్, ఇనిస్టిట్యూట్ ఆఫ్ అకౌంటెన్సీ డైరక్టర్ ఆర్. హరిహరరావు తెలిపారు. సోమవారం శ్రీకాకుళంలోని ప్రభుత్వ ఉమెన్స్ కళాశాల ఆవరణలో ఇంటర్నేషనల్ అకౌంటింగ్ డే పురస్కరించుకుని ఏర్పాటుచేసిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. ప్రస్తుత వ్యాపార ప్రపంచంలో కామర్స్, అకౌంటింగ్‌కు అధిక ప్రాధాన్యత ఉందని, కామర్స్ చదువుకున్న విద్యార్థులు ఎందరో ఉద్యోగాల్లో స్థిరపడుతున్నారని తెలిపారు.కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సూర్యచంద్రరావు, కామర్స్ విభాగాధిపతి ఎల్.కృష్ణారావు, వైస్ ప్రిన్సిపాల్ చిన్నారావు పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

ఎచ్చెర్ల, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ఎచ్చెర్ల పీహెచ్‌సీలో 40 మంది గర్భిణులకు సోమవారం ప్రత్యేక పరీక్షలు నిర్వహించారు. ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్‌కార్యక్రమంలో భాగంగా హైరిస్క్ గర్భిణులకు ప్రత్యేకంగా పరీక్షించి అవసరమైన సూచనలు చేశారు. జేమ్స్ ఆసుపత్రి సహకారంతో ఉచిత స్కానింగ్, రక్త, మధుమేహ పరీక్షలు నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ గంగప్రియ దర్శిని, డాక్టర్ ఎం.ఉషశ్రీ, సీహెచ్‌వో బి.రమేష్ బాబు పాల్గొన్నారు. అలాగే అల్లినగరం సత్య సాయి కమిటీ ఉచిత భోజనాన్ని అందజేశారు.

కారు రిపేరు చేస్తుండగా..

- వెనుక నుంచి వస్తూ బలంగా ఢీకొన్న మరో కారు
- మెకానిక్ మృతి.. మరో ముగ్గురికి తీవ్ర గాయాలు
- కోమర్తి వద్ద ఘటన



ఘటనా స్థలంలో చెల్లాచెదురుగా వాహనాలు



మృతిచెందిన వెంకటరావు

నరసన్నపేట, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): కోమర్తి జంక్షన్ జాతీయ రహదారి ఫ్లైఓవర్‌పై ఓ కారు మొరాయించింది. దీనిని ఓ మెకానిక్ బాగు చేస్తుండగా.. వెనుక నుంచి వచ్చిన మరో కారు బలంగా ఢీకొంది. ఈ ఘటనలో ఆ మెకానిక్ మృతి చెందగా.. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. సోమవారం ఉదయం విశాఖ నుంచి టెక్కలి వైపు వెళ్తున్న ఓ కారు కోమర్తి ఫ్లైఓవర్ పైకి వచ్చేసరికి ఇంజన్‌లో సాంకేతిక సమస్య తలెత్తింది. కారును రిపేరు చేసేందుకు శ్రీకాకుళం నగర సమీపాన పెద్దపాడుకు చెందిన మెకానిక్ కోరాడ వెంకటరావు (25)ను సంప్రదించగా బాగు చేసేందుకు ఒప్పుకున్నాడు. దీంతో మొరాయించిన కారులో ఉన్నవారంతా వేరొక వాహనంలో స్వస్థలాలకు వెళ్లిపోయారు. ఈ క్రమంలో వెంకటరావు సాయంత్రం 4 గంటలు సమయంలో తన ద్విచక్రవాహనంపై సహాయకుడు శామ్యూల్‌తో కలిసి కోమర్తి ఫ్లైఓవర్ వద్దకు చేరుకుని మొరాయించిన కారును పరిశీలిస్తున్నాడు. ఇదే సమయంలో శ్రీకాకుళం నుంచి సంతబొమ్మాళి మండలం పాలతలగాం గ్రామానికి వెళ్తున్న మరొక కారు అతివేగంగా వచ్చి మొరాయించి ఉన్న కారును ఢీకొంది. ఈ ప్రమాదంలో కారును పరిశీలిస్తున్న మెకానిక్ వెంకటరావు అక్కడికక్కడే మృతిచెందగా.. సహాయకుడు శామ్యూల్‌తోపాటు ఢీకొట్టిన కారులో ఉన్న ఎ.సంతోష్, సుశీల తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు గుర్తించి కారులో చిక్కుకున్నవారికి బయటకు తీసి గాయపడినవారిని హైవే అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం శ్రీకాకుళం తరలించారు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ దుర్గాప్రసాద్ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కాగా వెంకటరావుకి తండ్రి అప్పలసూరి, తల్లి మహాలక్ష్మి, సోదరి వెంకటలక్ష్మి ఉన్నారు. కుటుంబాన్ని పోషించే ఒక్కగానొక్క కుమారుడు మృతిచెందడంతో వారంతా కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. వెంకటలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

ఆత్మహత్య కేసులో హెచ్‌సీ అరెస్టు

- బంకు యజమానితోపాటు 15 రోజులు రిమాండ్

నందిగాం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): దేవుపురం పంచాయతీ తురకలకోట గ్రామానికి చెందిన మేఘవరం వెంకటరావు(33) ఆత్మహత్య కేసులో ఇద్దరికి రిమాండ్ విధించినట్టు ఎస్‌ఐ షేక్ మహ్మద్ ఆలీ సోమవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. వెంకటరావు వజ్రపుకొత్తూరు మండలం బెండిగేటు సమీపంలో గల ఓ పెట్రోల్ బంకులో పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో ఆ బంకు యజమాని బగాది రమేష్ నుంచి రూ.30వేలు అప్పుగా తీసుకున్నాడు. అప్పు తీర్చమని రమేష్ వేధిస్తుండడంతో మనస్తాపానికి గురై వెంకటరావు ఈ నెల 8న గ్రామ సమీపంలోని ఓ తోటలో చెట్టుకు ఉరివేసుకుని వెంకటరావు ఆత్మహత్య చేసుకున్నాడు. దీనిపై వెంకటరావు భార్య నీలవేణి ఇచ్చిన ఫిర్యాదు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. వెంకటరావును వేధింపులకు గురిచేసిన పెట్రోల్ బంకు యజమాని రమేష్‌తో పాటు అతడికి సహకరించిన వజ్రపుకొత్తూరు పోలీసుస్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ కోరాడ ఈశ్వరరావులను అరెస్టు చేశారు. వారిని పలాస కోర్టులో ఆదివారం రాత్రి హాజరుపరచగా.. న్యాయాధికారి మాధురి 15రోజులు రిమాండ్ విధించారు. దీంతో వారిద్దరిని నరసన్నపేట సబ్‌జైలుకు తరలించినట్టు ఎస్‌ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ విద్యార్థిని మృతి



దివ్య (ఫైల్)

నరసన్నపేట, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం సర్వజన ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మొగిలి దివ్య(16) సోమవారం మృతి చెందినట్టు ఎస్‌ఐ దుర్గాప్రసాద్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. జమ్ము పంచాయతీ గెడ్డయ్యపేటకు చెందిన దివ్య గత నెల 9న గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. వెంటనే కుటుంబ సభ్యులు గుర్తించి శ్రీకాకుళంలో పలు ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స అందజేయడంతో కోలుకుంది. ఈ క్రమంలో దివ్య రెండు రోజులు కిందట వాంతులు చేసుకుంటుండడంతో శ్రీకాకుళం సర్వజన ఆసుపత్రికి తన సోదరుడు తీసుకువెళ్లగా.. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందింది. ఎస్‌ఐ దుర్గాప్రసాద్ దర్యాప్తు చేస్తున్నారు. కాగా దివ్య జలుమూరు మండలం కరవంజ మోడల్ స్కూల్‌లో ఇంటర్ చదువుతోంది.

పాముకాటుతో రైతు కూలీ..



సింహాచలం (ఫైల్)

జలుమూరు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): పర్లాం పంచాయతీ యాతపేటకు చెందిన రైతు కూలీ వాడ సింహాచలం (55) పాముకాటుకు గురై సోమవారం మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. సింహాచలం కోత మిషన్‌పట్టుకొని వరిచేను కోతకు వెళ్లాడు. పొలంలో వరిచేను కోత కోస్తుంగా పాము కాటు వేయడంతో అపస్మారక స్థితికి చేరుకున్నాడు. ఇది గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం సమీపంలో గల సైరిగాం పీహెచ్‌సీకి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో బుడితి సీహెచ్‌సీకి తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈయనకు భార్య పుణ్యావతి, కుమారుడు, వివాహమైన కుమార్తె ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ బి.అశోక్‌బాబు తెలిపారు.

భర్త వేధింపులపై కేసు నమోదు

శ్రీకాకుళం క్రైం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలోని నానుబాలవీధికి చెందిన బొమ్మాళి గిరిబాబు అనుమానంతో తనను వేధిస్తున్నాడని ఆయన భార్య స్వర్ణకృప శ్రీకాకుళం టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు సోమవారం ఎస్‌ఐ లక్ష్మి కేసు నమోదు చేసి వివరాలను వెల్లడించారు. గిరిబాబు తన భార్య, ఇద్దరి పిల్లలతో కృష్ణాపార్కు సమీపంలోని నానుబాల వీధిలో నివాసముంటున్నాడు. తరచూ భార్యపై అనుమానంతో కొడుతున్నాడు. ఈనెల 8న రక్తం వచ్చినట్లు కొట్టడంతో స్వర్ణకృప శ్రీకాకుళం రిమ్స్‌లో చేరి చికిత్స పొందుతోంది. ముఖం, తలభాగంలో గాయాలు ఉన్నట్లు ఆమె ఫిర్యాదులో పేర్కొంది. కాగా గిరిబాబు గతంలో బలగ ప్రాంతంలో ఓ వ్యక్తిపై దాడి కేసులో నిందితుడిగా ఉన్నాడు.

సింగిల్ లేన్ల విస్తరణ ఎప్పుడో?

- ఇరుకు రోడ్లతో రాకపోకలకు ఇబ్బంది
- తరచూ ప్రమాదాలు
- మలుపుల వద్ద కానరాని హెచ్చరిక బోర్డులు



కేశుపురం వైపు వెళ్లే సింగల్ లైన్ రోడ్డు



ఇరుకైన రోడ్డులో లక్ష్మీపురం వద్ద ప్రమాదకరంగా ఉన్న మలుపు

పలాస రూరల్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): జిల్లాలో వివిధ గ్రామాలకు వెళ్లే సింగిల్ లేన్ రహదారుల విస్తరణ కోసం ఆయా ప్రాంత ప్రజలు దశాబ్దాలుగా ఎదురుచూస్తున్నారు. చిన్న రోడ్లు కావడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. పలాస మండలంలో గ్రామీణ ప్రాంత రోడ్లన్నీ ఇరుకుగా ఉండడంతో వాహనచోదకులు రాకపోకలకు ఇబ్బందిపడుతున్నారు. ప్రధానంగా గరుడఖండి జంక్షన్ నుంచి బ్రాహ్మణతర్లా వయా కేశుపురం వరకూ సింగిల్ లేన్ కావడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ రోడ్డులోని గ్రామాల నుంచి అధిక సంఖ్యలో ప్రజలు బ్రాహ్మణతర్లా, పలాస పట్టణాలకు వెళ్లి వస్తుంటారు. ఇరుకు రోడ్డుకి తోడుగా పిచ్చిమొక్కలు ఇరువైపులా ఏపుగా పెరిపోవడంతో వాహనచోదకులు ఇబ్బంది పడుతున్నారు. సింగిలేన్ రోడ్డు కావడంతో వాహనాలు ఎదురెదురుగా వస్తున్నప్పుడు ఇబ్బందిపడుతున్నారు. ఈ రహదారిలో అనేక మలుపులు ఉండడం, మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు కూడా లేకపోవడం ప్రధాన సమస్యగా మారింది. బ్రాహ్మణతర్లా నుంచి పలాసకు వచ్చే రహదారిలో లక్ష్మీపురం గ్రామం వద్ద ప్రధాన మలుపు అనేక ప్రమాదాలకు తావిస్తోంది. వేగంగా వస్తే సరైన విధంగా వాహనాన్ని కంట్రోల్ చేయలేక వాహనచోదకులు ప్రమాదానికి గురవుతున్నారు. ఆ ప్రాంతంలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాల్సి ఉంది. అదే విధంగా బ్రాహ్మణతర్లా మీదుగా బంటుకొత్తూరు, కేశుపురం రహదారిలో ఉన్న మలుపుల వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇలాంటి రహదారులు జిల్లాలో చాలా ప్రాంతాల్లో ఉన్నా విస్తరణకు నోచుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి జిల్లాలోని సింగిల్ లేన్ల రహదారులను విస్తరించడం, రోడ్డుకిరువైపులా పిచ్చిమొక్కల తొలగింపుతోపాటు ప్రమాదకరమైన మలుపులు వద్ద హెచ్చరిక బోర్డుల ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.

వైసీపీ ఆకృత్యాలకు అడ్డుకట్ట వేయాలి

- కోర్టుకు తెలియజేసిన టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి విఠల్‌రావు

పలాస, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): వైసీపీ సోషల్ మీడియా వికృత చేష్టలు, మహిళల పట్ల ఇష్టారీతిగా వ్యవహరిస్తూ వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్నట్టు 2021లో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పీరుకట్ల విఠల్‌రావు కాశీబుగ్గ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై అప్పటి పోలీసులు మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ఒత్తిళ్ల తలొగ్గి ఆ ఫిర్యాదును పట్టించుకోలేదు. దీనిపై విఠల్‌రావు కోర్టును ఆశ్రయించడంతో సోమవారం విచారణకు వచ్చింది. దీనిపై న్యాయ స్థానం ఫిర్యాదు చేసిన కేసును కొనసాగిస్తారా?... లేదా విరమించుకుంటారా? అని ప్రశ్నించగా కొనసాగిస్తాని విఠల్‌రావు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆ పార్టీ సోషల్ మీడియా రాష్ట్రంలో, పలాస నియోజకవర్గంలో చేసిన అరాచకాలు అన్నీఇన్నీ కావన్నారు. సోషల్‌మీడియా పేరుతో అప్పలరాజు కొంతమందిని పెంచి పోషించారని ఆరోపించారు. ప్రతిపక్షంలో ఉన్న ప్రస్తుత ఎమ్మెల్యే గౌతు శిరీష ప్రజల పక్షాన పోరాటం చేస్తే ఆమెపై, ఆమె తాత స్వాతంత్ర్య సమరయోధుడు సర్దార్ గౌతు లచ్చన్న, తండ్రి గౌతు శ్యామసుందర శివాజీని టార్గెట్ చేస్తూ సామాజిక మాధ్యమాల్లో జుగుప్సాకరమైన పోస్టులు పెట్టారని గుర్తుచేశారు. మహిళ అని చూడకుండా శిరీషపై అసభ్యకరమైన పోస్టులు పెట్టడం తనను తీవ్రంగా కలచివేసిందన్నారు. దీనికి అడ్డుకట్ట వేసేందుకు 2021 ఆగస్టులో పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. మంత్రి హోదాలో అప్పల రాజు కేసును అడ్డుకోగా పోలీసులు కోర్టుకు రిఫర్ చేశారన్నారు. దీనిపై తన వాదన బలంగా వినిపించామని, న్యాయం జరిగే వరకూ తాను పోరాటం చేస్తానని స్పష్టం చేశారు.

పేదోడికి అండగా ప్రభుత్వం: ఎమ్మెల్యే ఎంజీఆర్



బాధితురాలికి చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే మామిడి గోవిందరావు

పాతపట్నం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): కూటమి పాలనలోనే పేదోడికి భరోసా ఉటుందని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు (ఎంజీఆర్) తెలిపారు. తన క్యాంపు కార్యాలయంలో రూ.40,600 సీఎంఆర్‌ఎఫ్ చెక్కును లబ్ధిదారు ఇప్పిలి చిట్టెమ్మకు సోమవారం అందజేశారు. మండల పరిధి బోరుబద్ర గ్రామానికి చెందిన చిట్టెమ్మ అనారోగ్యానికి గురై వైద్యం చేయించుకొనే స్థోమత లేక ఎమ్మెల్యేను ఆశ్రయించగా.. ఆయన స్పందిస్తూ సీఎంఆర్‌ఎఫ్ నుంచి రూ. 40,600 మంజూరు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతీఒక్కరికీ ప్రభుత్వం నుంచి సాయం అందిస్తున్నట్టు తెలిపాను. అనంతరం స్థానిక మహేంద్రతనయ నదీ తీరాన గల నీలకంఠేశ్వరస్వామిని దర్శించుకుని పూజలు చేసి అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. టీడీపీ నాయకుల పైల బాబ్జీ, సైలాడ సతీష్, నల్లి జగదీశ్వరరావు, సూరపునాయుడు, కలమట భుజంగరావు తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులను ఆదుకోవాలి

హరిపురం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మందస మండలం ఏజెన్సీ ప్రాంతంలోని బుడార్సింగి పంచాయతీ సవర పద్మాపురం గిరిజన గ్రామంలో గత నెల 25న అగ్నిప్రమాదం సంభవించి నాలుగు పూరిళ్లు దగ్ధమయ్యాయి. ఈ ప్రమాదంలో సవర లాలు, సవర ఉదవ్, సవర డిల్లీ, సవర నోబిన్‌లకు చెందిన ఇళ్లు కాలిపోవడంతో నిలువ నీడలేకుండా పోయింది. దీంతో బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని ఆ గ్రామస్థులు కోరుతున్నారు. ఘటనా స్థలాన్ని అధికారులు, కూటమి నాయకులు సందర్శించారే తప్పా ఎలాంటి చూయూత ఇవ్వలేదని వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నిరుపేద కుటుంబాలను ఆదుకోవాలని కోరారు.

నేటి నుంచి ‘సిక్కోలు పుస్తక మహోత్సవం’



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జనవిజ్ఞాన వేదిక ప్రతినిధులు

టెక్కలి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 11 నుంచి 20వ తేదీ వరకు శ్రీకాకుళం మున్సిపల్ మైదానంలో నిర్వహించనున్న సిక్కోలు పుస్తక మహోత్సవం విజయవంతం చేయాలని వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి కుప్పిలి కామేశ్వరరావు పిలుపునిచ్చారు. సాహిత్య, సాంస్కృతిక, వైజ్ఞానిక ప్రదర్శనలు ఉంటాయన్నారు. ప్రత్యేక స్టాల్స్, కవితా పఠనాలు, జానపద, శాస్త్రీయ కళా ప్రదర్శనలు, కవుల సాహిత్య గోష్టులు, మ్యూజిక్ షోలు, అంతరిక్ష వీక్షణాలు ప్రతిరోజూ సాయంత్రం 4గంటల నుంచి రాత్రి 9గంటల వరకు జరుగునని తెలిపారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ లక్ష్మణరావు, డాక్టర్ రాజేష్, యూటీఎఫ్ నాయకులు దాలయ్య, పీఆర్‌టీయూ నాయకులు బాబూరావు, రామచంద్రరావు, మధు, సూర్యప్రకాష్‌లు పాల్గొన్నారు.

ఎండలమల్లన్న ఆదాయం రూ.6,26,367

టెక్కలి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): రావివలస ఎండలమల్లికార్జున స్వామికి కార్తీక మూడో సోమవారం రూ.6,26,367 ఆదాయం వచ్చిందని ఈవో జి.గురునాథరావు తెలిపారు. శీఘ్రదర్శనం ద్వారా రూ.1.70లక్షలు, శీర్షాభిషేకం ద్వారా రూ.2.32 లక్షలు, కేశఖండన ద్వారా రూ.20వేలు, హుండీ ద్వారా రూ.2,04,367లు ఆదాయం లభించిందన్నారు. అలాగే లడ్డూ ప్రసాదం ద్వారా రూ.2,23,575, పులిహోరా ప్రసాదం ద్వారా రూ.83,760 ఆదాయం వచ్చిందన్నారు. గత ఏడాది మూడో కార్తీక సోమవారం కంటే ఈ ఏడాది ఆదాయం తగ్గిందని ఆయన తెలిపారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



విజేతలకు బహుమతులు అందజేస్తున్న న్యాయాధికారి రోషిణి

పాతపట్నం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రతీఒక్కరూ చట్టాలపై కనీస అవగాహన కలిగి ఉండాలని పాతపట్నం జూనియర్ సివిల్ న్యాయాధికారి ఎం.రోషిణి తెలిపారు. లీగల్ డేను పురస్కరించుకుని నిర్వహించిన పోటీల్లో విజేతలకు స్థానిక కోర్టు ప్రాంగణంలో సోమవారం బహుమతులు అందజేశారు. స్థానిక కేజీబీవీ, డా.బీఆర్ అంబేడ్కర్ గురుకుల ఆశ్రమ పాఠశాల, ఏపీ మోడల్ స్కూల్, ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. వీరిలో ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థిని వి.శృతి, డా.బీఆర్ అంబేడ్కర్ గురుకుల ఆశ్రమ పాఠశాల విద్యార్థిని కె.నిసోరి చోలైట్ ద్వితీయ, కేజీబీవీకి చెందిన టి.హర్షిత మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. వీరికి న్యాయాధికారి బహుమతులు అందజేశారు.

పీఎంశ్రీ పథకం అమలుపై పరిశీలన

జలుమూరు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): కరవంజ ఆదర్శ పాఠశాలలో అమలవుతున్న ప్రధానమంత్రి స్కూల్ ఫర్ రైజింగ్ ఇండియా (పీఎంశ్రీ) పథకం అమలుపై ముగ్గురు సభ్యులతో కూడిన రాష్ట్ర బృందం సోమవారం పరిశీలించింది. ఈ పథకం కింద స్కూల్ అభివృద్ధికి ఇదివరలో రూ.3 లక్షలు ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ నిధులతో చేపట్టిన పనులపై ఆరా తీశారు. ఈ పరిశీలనలో బృంద సభ్యులు ఎస్.ప్రసాదరావు, పి.రమేష్, దివాకర్ చౌదరితోపాటు ఎంఈవోలు బి.మాధవరావు, ప్రసాదరావు, ప్రిన్సిపాల్ ఆర్.శివకుమార్, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా సీపీ బ్రౌన్ జయంతి



బ్రౌన్ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

పోలాకి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ఆంగ్లేయుడై ఉండి తెలుగు భాషలో కవితలు రాసి పేరొందిన ప్రముఖ కవి సీపీ బ్రౌన్ జయంతి సోమవారం మండల పరిషత్ సిబ్బంది నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రాసిన తెలుగు కవితలు, వ్యాసాలు గుర్తు చేసుకున్నారు. ఎంపీడీవో జి.రవికుమార్, డిప్యూటీ ఎంపీడీవో బి.పద్మావతి సిబ్బంది పాల్గొన్నారు. బ్రౌన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కొట్లాటలో ముగ్గురికి గాయాలు

ఇచ్ఛాపురం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ఆంధ్రా-ఒడిశా సరిహద్దు ప్రాంతం సుమాడి జంక్షన్ వద్ద జరిగిన కొట్లాటలో పట్టణానికి చెందిన ముగ్గురు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. ఆదివారం రాత్రి ఓ దాబా వద్ద ఒడిశాకు చెందిన వ్యక్తులు, పట్టణ పరిధి బెల్లుపడకు చెందిన ఉప్పాడ రాజారెడ్డి, ఉప్పాడ సుధారెడ్డి, దుర్గాసి భీమారెడ్డి మధ్య ఘర్షణ జరిగింది. ఈ గొడవలో ఒడిశాకు చెందిన గుర్తుతెలియని వ్యక్తులు కర్రలతో దాడి చేయడంతో వీరి ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే వీరిని 108లో ఇచ్ఛాపురం సీహెచ్‌సీకి తరలించారు. మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. ఒడిశా ప్రాంతంలో కొట్లాట జరగడటంతో ఆ రాష్ట్ర పోలీసులు కేసు నమోదు చేశారని పట్టణ ఎస్‌ఐ ముకుందరావు తెలిపారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

పలాస రూరల్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): పలాస మండలం లక్ష్మీపురం గ్రామంలో అర్చకుడిగా విధులు నిర్వహిస్తున్న దేవరాజుపండా అనారోగ్యంతో బాధపడుతుండడంతో ఆయనకు జైజగన్నాథ బ్రాహ్మణసంఘం సభ్యులు రూ.5 వేలు సోమవారం అందజేశారు. స్థానిక లోకనాథేశ్వర ఆలయంలో ఆయనకు సభ్యులు నగదును అందజేసి భవిష్యత్తులో అవసరమైతే సహకారం అందిస్తామని తెలిపారు. జైజగన్నాథ బ్రాహ్మణసంఘ అధ్యక్షుడు చంద్రశేఖర్‌త్యాడి, కార్యదర్శి బాబూరావు పండా, సభ్యులు రాఘవపండా, శ్రీను పాల్గొన్నారు.

రెండు రోజులు అవకాశం ఇవ్వండి

- పోలీసులకు మాజీ మంత్రి సీదిరి అభ్యర్థన

పలాస, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): కోర్టు వ్యవహారాలు ఉన్నందున తనకు రెండు రోజులు అవకాశం ఇవ్వాలని, ఈ నెల 13న విచారణకు హాజరవుతామని మాజీ మంత్రి, వైసీపీ నేత డాక్టర్ సీదిరి అప్పలరాజు కాశీబుగ్గ పోలీసులకు లేఖ అందించారు. ఆదివారం అప్పలరాజుకు ఎస్‌ఐ నర్సింహమూర్తి 41 నోటీసు ఇస్తూ సోమవారం ఓ కేసు విషయంలో విచారణకు హాజరు కావాలని కోరిన విషయం విదితమే. అయితే విచారణను ఈ నెల 13వ తేదీకి వాయిదా వేయాలని, కోర్టు వ్యహారం ఉన్నందున హాజరుకాలేకపోతున్నామని స్పష్టం చేశారు. దీంతో ఆయన గురువారం పోలీస్టేషన్‌కు హాజరవుతారు. అయితే అప్పలరాజు ఇచ్చిన సమాధానం సంతృప్తికరంగా లేదని కాశీబుగ్గ సిఐ పి.సూర్యనారాయణ తెలిపారు. కోర్టు వ్యవహారం ఉందని తెలిపారే తప్పా ఏ కోర్టు, వ్యవహారం ఏమిటనేది పేర్కొనకపోవడంతో తిరిగి నోటీసు తిప్పి మరొకటి ఇవ్వాలని కోరామన్నారు. గత నెలలో నకిలీ మద్యంపై వైసీపీ నేతలు ఆందోళన సమయంలో అనుమతులు లేకుండా ర్యాలీ, సమావేశం పెట్టడంపై సమాధానం ఇవ్వాలని ఆయనకు నోటీసు పంపించామన్నారు.

పోస్టాఫీస్‌లో వివాదం

టెక్కలి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): టెక్కలి హెడ్ పోస్టాఫీస్‌లో సోమవారం మధ్యాహ్నం పోస్టల్ వినియోగదారులకు, సిబ్బందికి మధ్య వాగ్వావాదం చోటు చేసుకుంది. పోస్టాఫీస్‌లో వినియోగదారులు వివిధ సేవల కోసం లైన్‌లో ఉంటుండగా.. సిబ్బంది మధ్యాహ్న భోజనం పేరిట వెళ్లిపోవడంపై అసంతృప్తి వ్యక్తం వారిని ప్రశ్నించారు. దీంతో కొంతసేపు ఇటు పోస్టల్ వినియోగదారులకు, సిబ్బందికి మధ్య వివాదం నెలకొంది. అప్రమత్తమైన పోస్టల్ అధికారులు వచ్చి సిబ్బందిని, ఖాతారుదాలను సర్ధిచెప్పడంతో సద్దుమణిగింది.

ప్రైవేటీకరణను విరమించుకోవాలి

కోటబొమ్మాళి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మెడికల్ కళాశాలను ప్రభుత్వం ప్రైవేటీకరణను చేసే ఆలోచనలను విరమించుకోవాలని మాజీ డిప్యూటీ సీఎం, వైసీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. సోమవారం టెక్కలి నియోజ కవర్గ వైఈసీప ఇన్‌చార్జి పేరాడ తిలక్ ఆధ్వర్యంలో యలమంచిలి, లఖందిడ్డి, గంగరాం సచివాలయాల పరిధిలో నిర్వహించిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎంపీపీ రోణంకి ఉమామల్లేశ్వరావు, జడ్పీటీసీ దుబ్బ వెంకటరావు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

రైతులపై భారం లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలి

నరసన్నపేట, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): రైతులు నుంచి పైసా ఖర్చు లేకుండా ధాన్యం సేకరణ చేపట్టి మిల్లర్లు అప్పగించే బాధ్యత అధికారులదేనని తహసీల్దార్ ఆర్.సత్యనారాయణ అన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ధాన్యం కొనుగోలుపై వ్యవసాయ, రెవెన్యూ, సాంకేతిక సిబ్బందితో సమీక్షించారు. తేమశాతంలో పొరపాట్లు లేకుండా బ్లూటూత్‌ద్వారా రికార్డు చేయడం జరుగుతుందన్నారు. ధాన్యం అన్‌లోడింగ్ సమయంలో కళాసీల కూలీ పేరుతో మిల్లర్లు వసూలు చేస్తే రైతులు వెంటనే ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో సీఎస్‌డీటీ రామకృష్ణ, ఏవో సూర్యకుమారి తదితరులు పాల్గొన్నారు.

- పోలాకి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ కాలానికి వచ్చిన ధాన్యాన్ని రైతుల నుంచి కొనుగోలుపై సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ పి.శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోలు కేంద్రాలను త్వరలో ఏర్పాటుచేస్తుందని రైతులకు అనువుగా కేంద్రాలకు సిబ్బందిని కేటాయించాలన్నారు. ధాన్యం తెచ్చిన వెంటనే బిల్లు చెల్లించే విధంగా సిబ్బంది పర్యవేక్షణ జరపాలన్నారు. ఎంపీడీవో రవికుమార్, వ్యవసాయాధికారి చిరంజీవి, సహకారసొసైటీ, వ్యవసాయ విస్తరణాధికారులు, రెవెన్యూసిబ్బంది పాల్గొన్నారు.
- పాతపట్నం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలుపై సమాయత్తం కావాలని మండల వ్యవసాయాధికారి కె సింహాచలం తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాల సమావేశ మందిరంలో ధాన్యం కొనుగోలుపై శిక్షణ కార్యక్రమాన్ని సిబ్బందికి సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం నాణ్యత ప్రమాణాల నిర్ధారణ దిశగా పలు సూచనలు సలహాలిచ్చారు. రైతాంగం దళారుల బారిన పడకుండా రైతులను పరిరక్షించాల్సిన బాధ్యత ఉందన్నారు. కార్యక్రమంలో సివిల్ సప్లై డీటీ ఎ.కుమారి, సిబ్బంది సంతోష్ తదితరులు పాల్గొన్నారు.
- హిరమండలం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): రైతు సేవాకేంద్రాలు ద్వారా ధాన్యం కొనుగోలు చేసే సమయంలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని మండల వ్యవసాయ అధికారి బి.సంధ్య అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ధాన్యం కొనుగోలుపై వ్యవసాయ సిబ్బందికి అవగాహన కల్పించారు. ఎంపీడీవో కాశీప్రసాదరావు, తహసీల్దార్ జోగారావు తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి

టెక్కలి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాలను తక్షణమే ప్రారంభించాలని ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బగాది వాసుదేవరావు అన్నారు. సోమవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో బమ్మిడి సోమేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈసారి ధాన్యం కొనుగోలులో తేమశాతం పెంచాలన్నారు. ఈనెల 16న టెక్కలిలో రైతు మహాసభలు నిర్వహించాలని తీర్మాణించారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు ఇప్పిలి మల్లేసు, మల్లయ్య, సోమేశ్వరరావు, లచ్చయ్య, సన్యాసి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ మీటర్ల ఏర్పాటుకు అనుమతులివ్వండి

కోటబొమ్మాళి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): స్థానిక మేజరు పంచాయతీ పరిధిలో గల ప్రకాష్‌నగర్ కాలనీలో నిర్మించిన ఇళ్లకు విద్యుత్ మీటర్లు పెట్టుకొనేందుకు అనుమతులు ఇవ్వాలని డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్‌ను కోరారు. ఈ మేరకు సోమవారం టీడీపీ మండల అధ్యక్షుడు బోయిన రమేష్ పలువురు లబ్ధిదారులతో కలిసి వినతి పత్రం అందజేశారు. ఎన్టీఆర్ ప్రభుత్వ హయాంలో ప్రకాష్‌నగర్ కాలనీలో పలువురు లబ్ధిదారులకు ఇళ్లు, స్థలాలు మంజూరు చేశారని, ప్రస్తుతం ఆ ఇళ్లు శిథిలావస్థకు చేరుకోవడంతో అక్కడ నూతనంగా ఇళ్లు నిర్మించుకున్న వారికి పూర్తి హక్కులు కల్పించి, విద్యుత్ మీటర్లు పెట్టుకొనేందుకు అనుమతులు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మజ్జి కృష్ణారావు, మెట్ట మోహనరావు, అచ్చెయ్యరెడ్డి ఉన్నారు.

శివస్వాముల తిరువీధి



కాశీబుగ్గలో తిరువీధి నిర్వహిస్తున్న శివస్వాములు

కాశీబుగ్గ, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో గల పదో వార్డులో ఉన్న కాశీవిశ్వేశ్వర ఆలయంలో 41 రోజులు శివస్వాములు దీక్ష పూనుకొని సోమవారం జంట పట్టణంలో తిరువీధి కార్యక్రమంలో నిర్వహించారు. శివస్వాములు రత్నాకర్, అశోక్, నవీన్, అనిల్, వెంకటరమణ మాట్లాడుతూ.. ఏటా శివమాల ధరించి భక్తిశ్రద్ధలతో దీక్ష చేపట్టి తిరువీధి కార్యక్రమం కాశీబుగ్గ శివాలయం వీధి నుంచి కన్యకాపరమేశ్వరి ఆలయం వరకు నృత్యాలతో శివలింగాన్ని ఊరేగించారు. కార్యక్రమంలో శివస్వాములు వినోద్, బలరాం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా లక్షదీపారాధన



దీపారాధనలో పాల్గొన్న భక్తులు

కొత్తూరు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మెట్టూరు బిట్-1 కృష్ణాపురం నిర్వాసిత కాలనీలో కార్తీక మాసం మూడో సోమవారం శివాలయం వద్ద లక్షదీపారాధన నిర్వహించారు. ఏటా శివాలయం వద్ద ఆలయ ధర్మకర్త బూర్లె శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని పూజలు చేశారు.